క్లుప్తంగా

నందిగాం -దిరిశవల్లి రోడ్డు నిర్మాణం పూర్తి



పెడన: డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఫండ్స్ రూ.20 లక్షలతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రారంభించిన పెడన మండలంలోని నందిగాం నుంచి దిరిశవల్లికి డొంక రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో నిధులు మంజూరు చేయడంతో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము)ల కృషితో రోడ్డు పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. దిరిశవల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి అభ్యర్థిగా బుద్ధప్రసాద్‌కే సీటు ఇవ్వాలి

మండల టీడీపీ తీర్మానం



నాగాయలంక: అవనిగడ్డ అసెంబ్లీ సీటును ఉమ్మడి కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి కాకుండా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్‌కే ఇవ్వాలంటూ శుక్రవారం జరిగిన మండల టీడీపీ సమావేశంలో కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు (చంటి) అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో శ్రీ దుర్గా సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో వేంచేసియున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వార్ల కల్యాణం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా జరిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ కె. హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమంలో ప్రయాణీకులకు మెరుగైన వసతుల గురించి సూచనలు, సలహాలు అందించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 99592 25466 నంబర్‌కు ఫోన్ చేయవలసినదిగా కోరారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు



చల్లపల్లి: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆరో నంబరు పంట కాలువ పక్కన ఉన్న గ్రామ పంచాయతీ పంప్ హౌస్‌లో గ్రామ పంచాయతీ నిధులు రూ.60 వేలతో నూతనంగా ఏర్పాటు చేసిన మోటారును ప్రారంభించారు. పెరుగుతున్న కుటుంబాల సంఖ్య, తాగునీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

వాహనాల తనిఖీ



గూడూరు: మండలంలో శుక్రవారం వాహనాల విస్తృత తనిఖీ చేపట్టారు. తరకటూరు చెక్‌పోస్ట్ సెంటరులో ఎస్‌ఐ ఐ.వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీలో స్థానిక వీఆర్వో కె.కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత వదిలిపెట్టారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా నగదు, మద్యం వంటివి తరలించకుండా నిరోధించడానికి తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



క్రైస్తవులతో కలిసి సిలువ మోస్తున్న పేర్ని కిట్టు



అవనిగడ్డలో సిలువ మోస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



సిలువ మార్గంలో సిలువను మోస్తున్న వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము)

- క్రైస్తవుల శాంతి ర్యాలీలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మచిలీపట్నంటౌన్: గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పరాసుపేటలోని ఆర్‌సీఎం చర్చికు చెందిన క్రైస్తవులు నగరంలో భారీ శాంతి ర్యాలీ చేశారు. పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయగా ఆయా చర్చిల పాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సిలువను మోస్తూ ర్యాలీలో ముందుకు సాగారు. బైబిల్‌ను, సిలువను పట్టుకుని ముందుకు సాగటంతో పాటు క్రైస్తవులతో పాటు పలుమార్లు మోకాళ్లపై నిలబడి ప్రార్థనలో పాల్గొన్నారు. స్థానిక కోనేరుసెంటర్‌లో పేర్ని కిట్టు క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం చూపారన్నారు. ఈ ర్యాలీలో రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కార్పొరేటర్లు యండ్రపాటి నాగేశ్వరరావు, ఏకశిరి వెంకటేశ్వరరావు, మాచవరపు రాంప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజీసు, వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ విభాగం నాయకురాలు అనుపమ ముఖర్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, బందెల థామస్‌నోబుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: మండలంలో గుడ్ ఫ్రైడే శుక్రవవారం క్రైస్తవ విశ్వాసులు, ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దైవజనురాలు కావూరి దేవమణి ధనరాజు మాట్లాడారు. గిల్గాలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘంటసాల, తాడేపల్లి చర్చిల్లో జరిగిన గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాస్టర్ కె.దానియేలు రాజు, నవీన్ బాబు, సతీష్ పాల్, దానియేలు సందేశం ఇచ్చారు. ఘంటసాల, కొడాలి బాపిస్టు చర్చిల్లో రెవ.ఎండీపీ ప్రసాద్, మట్టా ప్రియానందం, హైనీ చర్చిలో పాస్టర్ కె.దానియేలు, యేసుక్రీస్తు ప్రార్థనామందిరాల్లో పాస్టర్లు ఎ.ఏసు, సీహెచ్.దానియేలు, ఐఆర్ ఈఎఫ్ చర్చిలో కె.యేసుపాదాలు, యండకుదురు, కొడాలి, తెలుగురావుపాలెం, శ్రీకాకుళం, పాపవినాశనం, దాలిపర్రు చర్చిల్లో పాస్టర్లు శీరం సుందర్‌సింగ్, గుడిసేవ ప్రదీప్, కె.ప్రకాష్, షాలేమ్‌రాజు, శేఖర్, యేసుముత్యాలు, గోవాడ శ్యామ్‌బాబు, ఆర్ సీఎం, సీఎస్‌ఐతో పాటు వివిధ చర్చిల్లో గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

బోడగుంట(మోపిదేవి): మండలంలోని పలు ప్రార్థనా మందిరాల్లో గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. మానవాళికోసం క్రీస్తు చేసిన త్యాగాలు, బోదనలు స్మరించుకుంటూ ఆయన చూపిన శాంతి మార్గంలో ప్రజలు నడవాలని వక్తలు సూచించారు. అనంతరం దైవసేవకులచే ప్రార్థనలు చేశారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి గ్రామ పుర వీధుల్లో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ల ఆధ్వర్యంలో శుక్రవారం సిలువ మార్గము భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా బంటుమిల్లి, కొత్తపల్లి ఆర్‌సీఎం చర్చిల ఫాదర్లు కామా అనిల్‌కుమార్, తాళం జయరాజుల పర్యవేక్షణలో ఏసుప్రభువును సిలువ వేసిన ప్రతిమను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. మల్లేశ్వరం ఏఎంసీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు ఆయా గ్రామాల సంఘాల పెద్దలు పాల్గొన్నారు. ఉప్పాల రాము ప్రార్థనలు పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము) బంటుమిల్లి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలో పాల్గొన్నారు. ఫాదర్ అనిల్‌కుమార్ రాము చేత ప్రత్యేక ప్రార్థనలు చేయించి ఆశీర్వదించారు. అనంతరం రాము క్రీస్తు మార్గము గురించి ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, ఎంపీపీ వి.చినబాబు, వైస్ ఎంపీపీ ఓడిమి చిన్నారిబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ఎండి.కమాల్‌బాషా, పి.వీరబాబు, పార్టీ నాయకులు కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎం.రాజబాబు, జి.ఏడుకొండలు, జీవీ ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: ఏసుక్రీస్తు సిలువనొందిన దినమైన శుభ శుక్రవారమును మండల వ్యాప్తంగా విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ప్రార్థనా మందిరాలలో సిలువ మార్గాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) లక్ష్మీపురం ఆర్‌సీఎం చర్చి వద్ద ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పరిధిలోని పలు ప్రాంతాల్లో గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కోటగిరిలంకలోని పరిశుద్ధ తిరుకుటుంబ దేవాలయం విచారణ గురువు సురేష్ మెర్లో ఆధ్వర్యంలో సీతాయిలంక నుంచి అవనిగడ్డ పురవీధుల్లో సిలువ మార్గం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ కొద్దిదూరం సిలువ మోశారు. ఈ సందర్భంగా విచారణ గురువులు సురేష్ మెర్లో, గొరుముచ్చు క్రీస్తురాజు వారికి ఆశీస్సులు అందించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఆచరించిన ప్రేమ, కరుణ, క్షమ గుణాలతో ప్రతి ఒక్కరూ మెలగడం ద్వారా శాంతియుత సమాజం ఏర్పడుతుందని సూచించారు. అనంతరం భక్తులకు ఎమ్మెల్యే సింహాద్రి, వికాస్ మజ్జిగ పంపిణీ చేశారు. ఫాదర్ సురేష్, క్రీస్తురాజు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి విశ్వాసులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, ఆర్‌సీఎం చర్చి పరిధిలోని రెండు వేల మంది విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

సిలువ మార్గం భారీ ప్రదర్శన

నాగాయలంక: స్థానిక ఆర్‌సీఎం ప్రధానచర్చి ఆధ్వర్యంలో నాగాయలంక ప్రధాన వీధులలో క్రైస్తవులు సిలువలను చేతుల్లో ధరించి ఏసు ప్రభువుకు జేజేలు పలుకుతూ శుక్రవారం గుడ్‌ఫ్రైడే సిలువమార్గం భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన చర్చిఫాదర్ రెవరెండ్ జాన్‌బాబు సిలువ ధరించి నడిచారు. సంఘపెద్దలు, ఉపదేశకులు పాల్గొన్నారు. ఎదురుమొండి ఏజీసీఎం చర్చిలో రెవరెండ్ కె.జాన్ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమం జరిగింది. షాలేమురాజు, చిట్టా రారాజు తదితరులు పాల్గొన్నారు. టీ.కొత్తపాలెం శివారు దేగలవారి పాలెం నెహెమ్యా మినిస్ట్రీస్‌లో, మండలంలోని పలు ప్రార్థన మందిరాలలో గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పెడన: పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఆర్సీఎం చర్చి ఫాదర్ రెవరండమ్ విచారణ గురువురు ఎస్.జోజప్ప ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. సిలువ మార్గాన్ని పుర వీధులలోని ప్రధాన రహదారుల వెంబడి ఏసుప్రభువు కీర్తనలతో, క్రీస్తు నామాన్ని జపిస్తూ ర్యాలీ కొనసాగింది. మార్గం మధ్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) కొంత సేపు సిలువను మోసి భక్తిని చాటుకున్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా ఆర్సీఎం చర్చికి బెంగుళూరు నుంచి ఫాదర్ జోజిబాబు, కేరళ నుంచి ఫాదర్ జయరాజులు హాజరై క్రీస్తు సందేశాలను అందజేశారు. తిరిగి తోటమూలలోని ఆర్సీఎం చర్చికు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమాంజలి కాన్వెంట్ సిస్టర్స్, సంఘ పెద్దలు, ఉప్లా సభ్యులు, మరియదళ సభ్యులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గూడూరు: గుడ్ ఫ్రైడేను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గూడూరులోని షాలెం ప్రార్థనా మందిరంలో వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనల్లో ఉప్పాల రాముతో పాటుగా జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, పార్టీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం పెదబాబు, నాయకులు వేము ఆనంద్, లంకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: కోడూరులోని కృష్ణాపురం ఆర్సీఎం చర్చి వద్ద గుడ్‌ఫ్రైడే ఘనంగా జరిపారు. క్రీస్తు సిలువతో చర్చి వద్ద నుంచి కోడూరు ప్రధాన సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సిలువ ధరించి, ర్యాలీలో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనాలు చేసి పాస్టర్లు దీవెనలు అందించారు. విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, మెరకగౌడపాలెం, వడ్డెరకాలనీ, నాయుడుపేట, జయపురం, హరిపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల వద్ద కూడా గుడ్‌ఫ్రై డేను భక్తిప్రపత్తులతో నిర్వహించారు.

చల్లపల్లి: ప్రేమ, కరుణ, సహనం, త్యాగం జీసస్ మానవాళికి ఇచ్చిన గొప్ప సందేశమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే చల్లపల్లిలో ఘనంగా జరిగాయి. లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ జోసఫ్ ఆధ్వర్యంలో పన్నెండు గ్రామాల విశ్వాసులు తరలివచ్చి చల్లపల్లిలో సిలువ మార్గం నిర్వహించారు. ఎమ్మెల్యే విచ్చేసి సిలువ మోశారు.

కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని మరియమాత దేవాలయంలో ప్రభువును ప్రార్థించిన అనంతరం సిలువ మార్గం ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పాల్గొన్నారు. సిలువను మోశారు. మరియమాత ఆలయం పెద్దలు, పెదపట్నం, తాళ్లపాలెం, కానూరు, గ్రామాలకు చెందిన క్రైస్తవులు, పెదపట్నం సర్పంచి గడిదేసి అనూష, గ్రామ ఇన్చార్జి రాజు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గడిదేసి బాలజేసు, తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలుకరిస్తూ..కరచాలనం చేస్తూ

బందలాయిచెరువు, మర్రిపాలెం పర్యటనలో ఎమ్మెల్యే సింహాద్రి



గుడివాకవారిపాలెం వద్ద వృద్ధులతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: మండల పరిధిలోని బందలాయిచెరువులో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పలువురు వృద్ధులను కలుసుకుని ఆప్యాయంగా పలుకరించారు. నాగాయలంక నుంచి వస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గుడివాకవారిపాలెం, బందలాయిచెరువు వద్ద రహదారి పక్కనున్న వృద్ధులను చూసి కారుదిగి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వగ్రామం బందలాయిచెరువు కావడంతో ప్రతి ఒక్కరినీ పేరు పెట్టి ఆప్యాయంగా పలుకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. పథకాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నీ సక్రమంగా వస్తున్నాయని వృద్ధులు బదులిచ్చారు. కొంతమంది వృద్ధులు ఎమ్మెల్యేతో కరచాలనం చేయగా మరికొంతమంది ఆలింగనం చేసుకున్నారు.

రైతులతో మాటా మంతీ..

మర్రిపాలెం(నాగాయలంక): రాష్ట్రంలో జగనన్న పాలనలో సంక్షేమ పథకాల రూపంలో రైతులకు, సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరిందని, చంద్రబాబు నిత్యం చేసే తప్పుడు ఆరోపణలను పట్టించుకోకుండా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని అవనిగడ్డ అసెంబ్లీఅభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం మర్రిపాలెం, నాగాయలంక గ్రామాలలో పలువురితో మాటా మంతి జరిపారు. తొలుత మర్రిపాలెం రామాలయం వద్ద రచ్చబండ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్న రైతులు, పెద్దలతో మమేకం అయ్యారు. వారితో కలసి కూర్చుని కులాసా మాటలతో పాటు రైతులుకు ధాన్యం సొమ్ములు అందాయో లేదో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కనిపించిన పెద్దలను పలుకరిస్తూ సాగారు. నాగాయలంక తూర్పు బజారు రోడ్డులో పలువురిని కలిసి మే 13న జరిగే ఎన్నికల్లో జగనన్న గెలుపే పేదవర్గాలకు బలమని, కొనసాగుతున్న సంక్షేమానికి మలుపు కాగలదని ప్రజలంతా ఆయనకు అండగా నిలవాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇరువురిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట పార్టీశ్రేణులు ఎవరూ లేరు.

పీఏసీఎస్ ఛైర్మన్‌కు మాతృవియోగం



నరసమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు, నేతలు

తాడేపల్లి(ఘంటసాల): కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ తాతినేని వెంకటకృష్ణారావుకు మాతృవియోగం జరిగింది. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ తాతినేని కృష్ణారావు మాతృమూర్తి నరసమ్మ (86) గురువారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. మృతురాలు భర్త కామ్రేడ్ తాతినేని సత్యనారాయణ కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా పనిచేసి మూడుసార్లు కొత్తపల్లి బ్యాంకు ప్రెసిడెంట్‌గా పని చేయగా నరసమ్మ తాడేపల్లి పంచాయతీ వార్డు మెంబర్‌గా పని చేశారు. నరసమ్మకు ముగ్గురు కుమారులు కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ తాతినేని కృష్ణారావు, వెంకట సుబ్బారావు, బసవ శంకరరావు ఉన్నారు. స్థానిక నేతల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, యువనేత సింహాద్రి వికాస్‌లు శుక్రవారం తాడేపల్లిలోని నరసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నరసమ్మ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, శ్రీకాకుళం, కొడాలి, ఘంటసాల పీఏసీఎస్ చైర్మన్లు యడ్లపల్లి బసవయ్య, పరుచూరి రామకృష్ణ, వేమూరి రత్నశేఖర్, పార్టీ నేతలు పడమట వీర కుమార్, తాతా సీతారామయ్య, దోనె వెంకటేశ్వరరావు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..ప్రాణాలు తీస్తున్న గుంత



పెదప్రోలులో ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంత

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డులో వంతెన కూలిపోవడంతో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గత 10 నెలలుగా అధికారులు ఈ గుంతను పూడ్చకపోవడంతో మృత్యు కూపంగా నిలిచింది. ఇటీవల ఓ వ్యక్తి ఆ గుంతలో పడి మృతి చెందాడు. మరోసారి ప్రమాదం జరగకుండా అధికారులు వెంటనే ఈ గుంతను పూడ్చించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇఫ్తార్ విందు స్వీకరించిన కిట్టు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రంజాన్ సందర్భంగా ఉపవాసం అనంతరం ముస్లిలు నిర్వహించే ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం పాల్గొన్నారు. స్థానిక జలాల్‌పేటలోని హుస్సేన్ అలీషా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలతో పాటు ఇఫ్తార్ స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ మొహమ్మద్‌సాహెబ్, అన్వర్‌హుస్సేన్, మీర్‌నజాఫ్‌అలీ, బాషు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



ఎస్.ఐ సుబ్రహ్మణ్యం అదుపులో నిందితుడు

నాగాయలంక: మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న రెండు వేర్వేరు కేసుల్లో ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి ఏడు క్వార్టర్‌ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. నాగాయలంక నుంచి మద్యం బాటిళ్ల తరలిస్తున్న భావదేవరపల్లి వ్యక్తి పరిశె మహాలక్ష్మయ్య, జింకపాలెం గ్రామస్తుడు ఒడుగు వెంకటేశ్వరరావులను అరెస్ట్ చేశామన్నారు. నాగాయలంకలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడ్డాడని చెప్పారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మచిలీపట్నంటౌన్: చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా మృతి చెందిన నగరంలోని ఉల్లింగిపాలెంకు చెందిన మట్టా సోమయ్య కుటుంబ సభ్యులను చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం పరామర్శించారు. నోబుల్ ప్యారిస్ చర్చిలో జరిగిన గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో ఆమె పాల్గొన్న అనంతరం ఉల్లింగిపాలెం ఎస్సీ కాలనీకి చేరుకుని సోమయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కాలనీలో ఉన్న బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చంద్రబాబు ఆదేశాలతో ఈ యాత్ర చేపట్టే ముందు ఎంతో భయం వేసిందన్నారు. కార్యకర్తల అభిమానాన్ని చూసి ధైర్యంతో ముందుకు వెళుతున్నానన్నారు. ఉల్లింగిపాలెం సమీపంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి వద్ద మహిళలు భువనేశ్వరికి హారతులు ఇచ్చారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఘంటసాల మండలంలోని తాడేపల్లి గ్రామంలో గుండెపోటుతో మరణించిన టీడీపీ కార్యకర్త కొడాలి సుధాకరరావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ తరుపున అన్ని విధాలా ఆదుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

నేడు ప్రజాదీవెన

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి, మల్లంపూడి గ్రామాల్లో శనివారం ప్రజాదీవెన కార్యక్రమాలు జరుగుతాయని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) పాల్గొంటారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హారిక రాములు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం పేదలకు అందజేసిన సంక్షేమ ఫలాల కరపత్రాలు అందజేస్తూ ఓట్లు అభ్యర్థిస్తారని మహేష్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని మహేష్ విజ్ఞప్తి చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

నాలుగు కోళ్లు, రూ.15 వేల నగదు స్వాధీనం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో కోడి పందేల శిబిరంపై గురువారం సాయంత్రం దాడి చేశామని ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ శుక్రవారంతెలిపారు. పోలీసులు కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై ఆకస్మిక దాడిచేసి 23 మందిని పట్టుకున్నట్లు వివరించారు. రెండు వేర్వేరు శిబిరాలపై దాడులు చేశామన్నారు. ఒక శిబిరంలో పది మంది నుంచి రూ.9,500 నగదు రెండు కోళ్లు, రెండు కత్తులు మరో శిబిరంలో 13 మంది నుంచి రూ.5,500 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ వివరించారు.